పేదల గూడు.. సమస్యల గోడు

రాజీవ్ గృహకల్ప ఇళ్లకు అందని మిషన్ భగీరథ నీళ్లు



మొయినాబాద్ మండలం చిలుకూరులోని రాజీవ్ గృహకల్ప ఇళ్లు

- అధ్వానంగా పారిశుద్ధ్యం
- పట్టించుకోని అధికారులు
- మున్సిపల్ ఏర్పాటుతోనైనా సమస్యలు తీరేనా?

మొయినాబాద్: పేదల కలల గూడులో సమస్యల గోడు వినిపిస్తోంది. పన్నెండేళ్ల క్రితం పేదలకు ఇచ్చిన రాజీవ్ గృహకల్ప ఇళ్లకు మిషన్ భగీరథ నీళ్లు అందడంలేదు. మరోవైపు డ్రైనేజీ, వీధిదీపాలు, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గృహాలు లబ్ధిదారులకు అందించి పన్నెండేళ్లు దాటినా ఇప్పటికీ అవి హెచ్ఎండీఏ పరిధిలోనే ఉన్నాయి. మున్సిపాలిటీ ఏర్పాటుతోనైనా సమస్యలు తీరుతాయో లేదో అన్ని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

2013 జనవరిలో పంపిణీ..

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరులో 2006లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు సొంతింటి కల నెరవేర్చడం కోసం జేఎన్ఎన్‌యూఆర్ఎం(జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్) పథకం కింద 992 రాజీవ్‌గృహకల్ప ఇళ్లను మంజూరు చేశారు. అందుకోసం రూ.35 కోట్ల నిధులు కేటాయించారు. 2008లో పనులు ప్రారంభమై 2012లో పూర్తయ్యాయి. 2013 జనవరిలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర హోంమంత్రి సబితారెడ్డి గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు.

బోర్ల ద్వారానే నీటి సరఫరా..

తెలంగాణ రాష్ట్రం వచ్చాక ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ నల్లా నీళ్లు అందిస్తోంది. కానీ చిలుకూరులోని రాజీవ్ గృహకల్ప గృహాలకు మాత్రం మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదు. దీనికి ప్రధాన కారణం ఈ గృహాలు స్థానిక పంచాయతీలో నమోదు చేయకుండా హెచ్ఎండీఏ పరిధిలోనే ఉంచారు. అప్పట్లో ఈ గృహాలను హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించారు. తరువాత హెచ్ఎండీఏ నుంచి అప్పటి గ్రామ పంచాయతీకి బదిలీ చేయాల్సి ఉండగా అలా చేయలేదు. దీంతో ఇక్కడ మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేయలేదు. ప్రస్తుతం ఇక్కడ బోర్ల ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు.

పంచాయతీపైనే భారం

చిలుకూరు రాజీవ్ గృహకల్ప ఇళ్లు అప్పట్లో గ్రామ పంచాయతీలో నమోదు కాకున్నా ఇక్కడి సమస్యల పరిష్కార భారం మాత్రం గ్రామ పంచాయతీపైనే పడుతోంది. బోర్ల దార్వా నీటిసరఫరాతో పాటు పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ వంటి పనులన్నీ గ్రామ పంచాయతీ ద్వారానే చేయిస్తున్నారు. ఇక్కడ నిర్మించిన సెప్టిక్ ట్యాంక్‌లు ప్రతి ఆరు నెలలకోసారి నిండుతుండడంతో వాటిని గ్రామ పంచాయతీ ద్వారానే ఖాళీ చేయిస్తున్నారు. ఈ ఖర్చులన్నీ గ్రామ పంచాయతీ భరించింది. అయితే ఇటీవల చిలుకూరు గ్రామ పంచాయతీ కొత్తగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీలో విలీనమైంది. ఇప్పుడు రాజీవ్ గృహకల్ప ఇళ్లు కూడా మున్సిపాలిటీలో విలీనమయ్యాయా లేదా అనే విషయంలో మాత్రం స్పష్టత లేదు. ఇక్కడి సమస్యలను మున్సిపాలిటీ అధికారులు మాత్రం ఇప్పుడు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా హెచ్ఎండీఏ అధికారులు ఈ గృహాలను మున్సిపాలిటీకి అప్పగిస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

తాగునీటిని కొనుక్కుంటున్నాం

చిలుకూరు రాజీవ్ గృహకల్ప ఇళ్లకు మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. ఇళ్లలో వాడుకోవడానికి బోరు నీళ్లు వస్తున్నాయి. తాగేనీళ్లు మాత్రం కొనుక్కుంటున్నాం. పారిశుద్ధ్య నిర్వహణ సరిగాలేదు. ఇళ్ల మధ్యే చెత్తాచెదారం వేయాల్సి వస్తోంది. వీధి దీపాలు సరిగా వెలగడంలేదు.

– కాడిగళ్ల కృష్ణ, రాజీవ్ గృహకల్ప, చిలుకూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



చిలుకూరులో ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయానికి సంబంధించి నీటి సమస్య విషయం మా దృష్టికి రాలేదు. గతంలో గ్రామ పంచాయతీలో లేకుంటే.. మా మున్సిపాలిటీ పరిధిలో కూడా లేనట్లే. అయినా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– మహ్మద్ ఖాజామొయిజుద్దీన్, కమిషనర్

క్లుప్తంగా

ఉత్సాహంగా స్వయంపాలన



విద్యార్థులతో ఉపాధ్యాయులు

షాద్‌నగర్: మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం రేవతి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్‌బాబు, సర్వరాజ్ అన్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర కళా నాటకం



వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాబృందం

మొయినాబాద్‌రూరల్: మండలంలోని కనకమామిడి దత్తాత్రేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన సత్యహరిశ్చంద్ర వీధినాటకం చూపరులను ఆకట్టుకుంది. దత్తాత్రేయ స్వామి జయంతిని పురస్కరించుకొని మూడోరోజు బుధవారం గ్రామంలో గల శ్రీ గురుదత్త దేవాలయంలో షాద్‌నగర్ సాంస్కృతిక సేవా సమితి కళాజ్యోతి ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు వడ్ల రమేష్‌చారి ఈ నాటక మహోత్సవాన్ని ప్రదర్శించారు. రోజు రోజుకు కనుమరుగవుతున్న నాటకాన్ని ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భాషా సాంస్కృతిక సంస్థ సౌజన్యంతో దేవాలయ కమిటీ సహకారంతో వారణాసి రామయ్య ప్రభువుల 83వ వార్షికోత్సవంలో భాగంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని భరద్వాజ్ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు విన్నవించారు. బుధవారం భరద్వాజ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ జమీర్ హైమద్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో మురుగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపైనే మురుగు పారుతోందని ఆరోపించారు. మురుగునీరు రోడ్లపై పారడంతో ఈగలు, దోమలు చేరి రోగాలు వస్తున్నాయని వివరించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బి.కుమార్, ఉపాధ్యక్షుడు సయ్యద్ సలీం, సహాయ కార్యదర్శి గఫార్, సభ్యులు తదితరులు ఉన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె



విద్యార్థినుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె, అధ్యాపకులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత విద్యావంతులుగా ఉజ్వల భవిష్యత్ పొందాలని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. బుధవారం పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రంపై విద్యార్థినులు సోషల్ సైన్స్ ఎగ్జిబిషన్–2025ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పార్లమెంట్ భవన్, బృహదీశ్వర ఆలయం, తెలంగాణ సంస్కృతి, వారసత్వం, తెలంగాణ రుచులు, కళలు తదితర అంశాలపై ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థినులు ప్రదర్శించిన నమూనాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె మాట్లాడుతూ.. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. విద్యార్థులు ప్రణాళికలను రూపొందించుకొని నిరంతరం శ్రమిస్తే లక్ష్య సాధనను చేరుకుంటారన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్

నందిగామ: గత పదేళ్లు అధికారంలో ఉండి బీఆర్ఎస్ చేయలేని అనేక అభివృద్ధి పనులను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేవలం 15 నెలల కాలంలో చేసి చూపుతున్నాడని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని బండోనిగూడ నుంచి షాబాద్ మండలం మద్దూరు శివారు వరకు ఇటీవల పూర్తి చేసిన సీసీరోడ్డు పనులను ఆయా గ్రామస్తులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం బండోనిగూడ, మద్దూరు గ్రామాల సరిహద్దులో సీసీరోడ్డును పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు. మద్దూరు శివారులో భూములు, ఫాం హౌస్‌లు కలిగి ఉన్న బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఏనాడు ఆయా గ్రామాల అభివృద్ధిని పట్టించుకున్న పాపన పోలేదని విమర్శించారు. కేవలం తన భూమిని అభివృద్ధి పరుచుకొనుటకు ప్రభుత్వ సంపద అయిన ఎర్రమట్టిని కొల్లగొట్టిన ఘనత ఆ మాజీ మంత్రికే దక్కుతుందని ఆరోపించారు.

పాఠశాలల్లో తరగతి గదులు ప్రారంభం



ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి ప్రారంభోత్సవంలో సంస్థ ప్రతినిధులు, సిబ్బంది

శంకర్‌పల్లి: హైదరాబాద్ టైటాన్స్ రౌండ్ టేబుల్ 308 ఆధ్వర్యంలో శంకర్‌పల్లి పట్టణం, మండలంలోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో రూ.37లక్షలతో అదనపు తరగతుల నిర్మాణం చేపట్టారు. వాటిని బుధవారం సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.30లక్షలతో మూడు అదనపు తరగతి గదులను జెడ్‌ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో, మండలంలోని చెందిప్ప ప్రాథమిక పాఠశాలలో రూ.7లక్షలతో ఒక తరగతి నిర్మాణాన్ని జలదంకి వెంకటకృష్ణ సహకారంతో నిర్మించినట్లు రౌండ్ టేబుల్ సభ్యులు హర్షిత్‌సేథ్, లోకేశ్‌రెడ్డి, అఖిల్, చైతన్య తెలిపారు. ఇప్పటివరకు తమ సంస్థ ద్వారా 6,600 అదనపు తరగతులు నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణస్వామి, ప్రతినిధులు రాకేశ్ మిశ్రా, శివరామ్, పాఠశాల హెచ్‌ఎం ఉదయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించాలి



మేకకు నట్టల మందు వేస్తున్న డాక్టర్ శ్రావణి

శంకర్‌పల్లి: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, తగు చికిత్స అందించాలని మహారాజ్‌పేట్ పశు వైద్యాధికారి శ్రావణి అన్నారు. బుధవారం మండలంలోని కాకర్లగుట్ట తండాలో సత్యసాయిబాబ ట్రస్ట్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 195 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స, నట్టల నివారణ మందు, పలు మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం వైద్యురాలు మాట్లాడుతూ.. తాము ప్రతి నిత్యం అందుబాటులో ఉంటామని, పశువులకు ఏ చిన్న సమస్య ఎదురైనా పశు వైద్యశాలకు తీసుకురావాలని ఆమె పాడి రైతులకు సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నుంచి సైంటిస్ట్ బీ.సీ రామన్న, పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని యశోద ఆస్పత్రి వైద్యులు నవీన్‌కుమార్, మౌనిక అన్నారు. మండలంలోని కమ్మెట గ్రామంలో బుధవారం గ్రామానికి చెందిన యువకుడు శశిధర్‌గౌడ్ ఆధ్వర్యంలో నగరంలోని యశోద ఆస్పత్రి వైద్యుల బృందం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 200ల మంది ప్రజలు హాజరైనట్లు పరీక్షలు చేయించుకున్నారని, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామని వైద్యులు తెలిపారు. వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయించిన ఎం.శశిధర్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజల కోసం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని కోరిన వెంటనే వచ్చిన యశోద ఆస్పత్రి వైద్యుల బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైద్యుల సలహాల మేరకు ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు ప్రజలు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 3 అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిధులను మంజూరు చేయడంపై పాఠశాల హెచ్‌ఎం శైలజ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల దుస్థితిని తెలుసుకొని ఎమ్మెల్యే రూ.43.50లక్షల నిధులను మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

యువతకు అహల్యాబాయి ఆదర్శం

ప్రిన్సిపాల్ డాక్టర్ కమల



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

షాద్‌నగర్: విద్యార్థులు అహల్యాబాయిని ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కమల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమాజ సంస్కర్త అహల్యాబాయి చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల సాంస్కృతిక శాఖ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ధర్మం పట్ల ఆమెకు ఉన్న అచంచల విశ్వాసమే ఆమెను నాయకురాలిగా తీర్చిదిద్దిందని, విద్యార్థులు ఆమె జీవిత చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి.సత్యనారాయణ, శ్రీనివాసులు, రవిప్రసాద్, జానారెడ్డి, అరుణ, మిస్బా, సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మార్కెట్ విధానాన్ని రద్దుచేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న పద్మ, నాయకులు

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ
- చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా, వినతిపత్రం అందజేత

చేవెళ్ల: కేంద్ర పాలకులు తీసుకొచ్చిన రైతు వ్యతిరేక జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో వ్యతిరేకిస్తూ తీర్మానించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బుధవారం రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దుచేయాలని, పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, రుణమాఫీ చట్టాన్ని చేయాలని, విద్యుత్ ప్రైవేటీకరించొద్దని, కౌలు రైతులకు సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపజేయాలనే డిమాండ్లతో రాష్ట్ర పార్టీ ఆదేశాలతో ఈ ధర్నా చేపట్టినట్లు తెలిపారు. గతంలో రైతాంగం ఉద్యమించిన ఫలితంగా ఉపసంహరించుకున్న ఈ రైతు వ్యతిరేక చట్టాలను తిరిగి దొంగ దారిలో అమలు చేయటానికి కేంద్రంలో ప్రధాన మంత్రి పూనుకున్నట్లు ఆరోపించారు. ఈ విధానాలతో రైతు రక్షణ దెబ్బతినే పరిస్థితి వస్తుందన్నారు. రైతులకు మేలు చేయలేని ఇలాంటి విధానాలను తీసుకురావద్దని వెంటనే వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మళ్లీ రైతులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి. నాగిరెడ్డి, సుధాకర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, ఎం. శివుడు, నారాయణ రెడ్డి, సత్తిరెడ్డి, సుభాన్‌రెడ్డి, అంజయ్య, సుధీర్, అమృత, తదితరులు పాల్గొన్నారు.

గుంత చింత తీరింది

సాక్షి ఎఫెక్ట్..

చేవెళ్ల: మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో ఏర్పడిన గుంతను ఎట్టకేలకు అధికారులు పూడ్చివేశారు. చేవెళ్లలో ఆరు రోజులుగా పైపులైన్ లీకేజీతో ఏర్పడిన గుంతను పూడ్చివేయకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంగళవారం 'గుంత.. చింత' అని ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేసి గుంతను పూడ్చివేశారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, సాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



లీకేజీతో ఏర్పడిన గుంతను పూడ్చివేయించిన అధికారులు

ఉద్యమకారుడిగా బీఆర్ఎస్‌కు భిక్ష పెట్టాను

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుడిగా బీఆర్ఎస్ పార్టీకి తాను భిక్ష పెట్టానని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనకు రాజకీయ భిక్ష పెట్టింది బీఆర్ఎస్ పార్టీ కాదని, తానే ఆ పార్టీకి భిక్ష పెట్టానన్నారు. తెలంగాణ ఉద్యమంలో పార్టీ కోసం పనిచేసి, జెండా మోసినవారు ఎంత మంది పదవులు అనుభవించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించి పార్టీ పటిష్టత కోసం పనిచేశానని, కానీ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు నాయకులు తనను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారని, దాడి జరిగినా ఎవరూ మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తనపై కొందరు బీఆర్ఎస్ నేతలు లేనిపోని మాటలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎవరికి అమ్ముడు పోలేదని, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఎంతకు అమ్ముడుపోయి బీఆర్ఎస్ పార్టీకి వచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యమకారులకు గౌరవం లభించిందన్నారు. ఉద్యమకారుల అభివృద్ధి అంశం కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, నాయకులు నర్సింహ, జాంగారి రవి తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతం



చేవెళ్ల: పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

షాద్‌నగర్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కమ్మదనంలోని గురుకుల కళాశాల, మొగిలిగిద్దలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రతిభ, విశ్వభారతీ, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. అరగంట ముందు నుంచే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 2,604 మందికిగాను 2,469 మంది విద్యార్థులు హాజరయ్యారు. 135 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు కస్టోడియన్ అధికారి శ్రీకాంత్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి బందోబస్తు నిర్వహించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

నలుగురు గైర్హాజరు..

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండల పరిధిలోని కేజీబీవీలో చదివే విద్యార్థులతో పాటు కొత్తూర్ మండల పరిధిలోని జేపీ దర్గా వద్ద ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు కొత్తపేట సెంటర్‌గా పడింది. సెంటర్‌లో మొదటి సంవత్సరం పరీక్షలకు 186 మంది విద్యార్థులకు గాను 182 మంది హాజరైనట్లు చీఫ్ ఎగ్జామినర్ మల్లేశ్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ అజాంఅలీ పరిశీలించారు.

26 మంది గైర్హాజరు..

మొయినాబాద్/మొయినాబాద్‌రూరల్ : మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాల్లో మొదటిరోజు 26 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. చిలుకూరు గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసి పరీక్షా కేంద్రంలో 438 మందికి 433 మంది విద్యార్థులు హాజరయ్యారు. చిలుకూరు రెవెన్యూలో ఉన్న షాహీన్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 299 మంది విద్యార్థులకుగాను 294 మంది, మొయినాబాద్‌లోని ఛాలెంజర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 438 మంది విద్యార్థులకుగాను 431 మంది, పెద్దమంగళారంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 481 మంది విద్యార్థులకుగాను 476 మంది, హిమాయత్‌నగర్‌లోని ఎన్‌టీఆర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 556 మంది విద్యార్థులకుగాను 552 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



మొయినాబాద్‌రూరల్: హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

45 మంది విద్యార్థులు గైర్హాజరు..

చేవెళ్ల: మండలంలోని నాలుగు కేంద్రాల్లో మొదటిరోజు మొత్తం 1229 మంది విద్యార్థులకు గాను 1184 మంది హాజరుకాగా 45 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ బుచ్చయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్దకు ఆరగంట ముందుగానే విద్యార్థులు చేరుకున్నారు.

97.15శాతం హాజరు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలోని ఆదర్శ పాఠశాల, చైతన్య కళాశాల, వివేకానంద కళాశాల్లో పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 1441మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. తొలిరోజు 1400 మంది (97.15శాతం) హాజరయ్యారని, 41మంది గైర్హాజరైనట్లు కస్టోడియన్ వసంత తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఎంపీడీఓ వెంకయ్య తనిఖీ చేశారు.



షాద్‌నగర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు